సాక్షి
కుమురం భీం

శనివారం ၊ 19 ၊ ఆగస్టు ၊ 2023



దృశ్యం.. సజీవం

రెప్పపాటు కాలంలో దృశ్యాన్ని బంధించి శాశ్వత కాలానికి సజీవ సాక్ష్యంగా నిలిపేదే ఛాయాచిత్రం. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కథనం. 8లో▸



అరకకు డిమాండ్!

పత్తి పంటలో ప్రస్తుతం దౌర కొడుతుండటంతో అరకకు డిమాండ్ పెరిగింది. రైతులకు వారం, పది రోజుల ముందే అడ్వాన్సులు ఇస్తున్నారు. 9లో▸



వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. అల్పపీడన ప్రభావంతో జిల్లా అంతటా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు 5కే రన్

ఆసిఫాబాద్: ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే నినాదంతో శనివారం ఉదయం 6 గంటలకు జిల్లా కేంద్రంలోని నిర్వహించే 5కే రన్ విజయవంతం చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంతోపాటు కాగజ్‌నగర్ పట్టణంలోనూ 5కే రన్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు, యువత స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సెకండ్ ఏఎన్‌ఎంల వినూత్న నిరసన



కలెక్టరేట్ ఎదుట ఒంటి కాలిపై నిరసన తెలుపుతున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

ఆసిఫాబాద్‌రూరల్: సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టిన సెకండ్ ఏఎన్‌ఎంలు శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట వినూత్నంగా ఒంటి కాలుపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున సెకండ్ ఏఎన్‌ఎంలు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా స్పందించి వారిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వసంత, పుణ్యవతి, భూదేవి, ప్రమీల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గాంధీ సినిమా ప్రదర్శన



జిల్లా కేంద్రంలో సినిమా వీక్షిస్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: బాల్యం నుంచే విద్యార్థుల్లో జాతీయభావం పెంపొందించేందుకు జిల్లాలోని రెండు థియేటర్లలో గాంధీ సినిమాను ప్రదర్శిస్తున్నట్లు ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబు, జిల్లా పౌరసంబంధాల అధికారి కృష్ణమూర్తి తెలిపారు. స్వతంత్ర వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమాల్లో భాగంగా ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కుమురంభీం థియేటర్, కాగజ్‌నగర్‌లోని వెంకటరమణ థియేటర్‌లో శుక్రవారం గాంధీ చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో కలిసి సినిమాను వీక్షించారు. ఈ నెల 24 వరకు చిత్ర ప్రదర్శన కొనసాగుతుందని తెలిపారు. జిల్లా కేంద్రంలో 120 మంది, కాగజ్‌నగర్‌లో 795 మంది చిత్రాన్ని వీక్షించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో శ్రీనివాస్, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న సింగరేణి అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో గల దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓసీపీ ఉద్యోగులు, అధికారులు కుంకుమ పూజలు, నవగ్రహ పూజలు, హోమం నిర్వహించారు. ఎస్‌వో టూ జీఎం నరేందర్, ఏరియా ఇంజినీర్ తిరుమల్‌రావు, ప్రాజెక్టు అధికారి సత్యనారాయణ, ప్రాజెక్టు ఇంజనీరు రాజాజీ, మేనేజర్ ప్రవీణ్ పాటింగ్, సేఫ్టీ అధికారి రాజేశ్వర్‌రావుతో పాటు ఇతర అధికారులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు కార్నాథం వెంకటేశ్, చంద్రశేఖర్, వెంకటేశ్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

'నోటుకు ఓటు అమ్ముకోవద్దు'

ఆసిఫాబాద్‌రూరల్: ప్రజలు నోటుకు ఆశపడి ఓటు అమ్ముకోవద్దని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్ రమేశ్ అన్నారు. ఆసిఫాబాద్ మండలం దద్పాపూర్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలపై సవతి తల్లి ప్రేమ చూపుతుందన్నారు. అన్ని కులాలకు రూ.10లక్షలు ఇచ్చే విధంగా బీసీ బంధు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. బీసీల ఓట్లతో గెలిచిన నాయకులు తమను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రణయ్, శంకర్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

కోవ వైపే మొగ్గు..!

- బీఆర్‌ఎస్ అధిష్టానంతో జెడ్పీ చైర్‌పర్సన్, సిట్టింగ్ ఎమ్మెల్యే భేటీ
- ఆసిఫాబాద్ టికెట్ కేటాయింపుపై చర్చలు
- సర్వేలన్నీ తనకే అనుకూలంగా ఉన్నాయని స్పష్టం చేసిన కోవ లక్ష్మి
- ఆత్రం సక్కుకు ఎంపీగా అవకాశం..!
- హైదరాబాద్‌లోనే ఉండాలని ఇరువురికి అధిష్టానం ఆదేశం



సాక్షి, ఆసిఫాబాద్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై సుదీర్ఘ కసరత్తు చేసిన బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆసిఫాబాద్ టికెట్ విషయంలో ఆచితూచి అడుగులేస్తున్నట్లు సమాచారం. త్వరలో జరగనున్న ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే టికెట్ ఇవ్వాలని నిర్ణయానికి వచ్చిన కేసీఆర్ ఆసిఫాబాద్ నియోజకవర్గ విషయంలో అదే సూత్రానికి కట్టుబడి ఉంటారని బీఆర్‌ఎస్‌లోని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. గురువారం అధిష్టానం టికెట్ విషయంలో సిట్టింగ్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, టికెట్ ఆశిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మిని పిలిపించి మాట్లాడింది. ఇరువురి అభిప్రాయాలు తెలుసుకుంది. కోవ లక్ష్మికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని అధిష్టానం నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంలో 'వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నేనే పోటీ చేస్తా.. నాకు ఎంపీ టికెట్ వద్దు.. కార్పొరేషన్ పదవులొద్దు.. సిట్టింగ్ ఎమ్మెల్యేకు నేను సపోర్టు చేసినా గెలవరు.. సర్వేలన్నీ నాకే అనుకూలంగా ఉన్నాయి.. ఆలోచించి నిర్ణయం తీసుకోండి..' అంటూ జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అధిష్టానం ముందు కుండబద్దలు కొట్టినట్లు తెలుస్తోంది. దీంతో పార్టీ అధిష్టానం పునరాలోచనలో పడినట్లు సమాచారం. తుది నిర్ణయం తీసుకునే వరకు ఇరువురూ హైదరాబాద్‌లో ఉండాలని ఆదేశించినట్లు సమాచారం.

నేడు విలేకరుల సమావేశం..

రానున్న శాసనసభ ఎన్నికల్లో పార్టీని గెలిపించుకుని మూడోసారి అధికారం చేపట్టాలని భావిస్తున్న బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ అభ్యర్థుల ఎంపిక విషయంలో ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసిందే. ఆసిఫాబాద్ టికెట్ విషయంలో తొలుత కొంత సంశయానికి గురైన అధిష్టానం.. చివరకు గెలుపు గుర్రాలకే టికెట్ ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సర్వేలన్నింటిలోనూ సిట్టింగ్ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఉండటం.. జెడ్పీ చైర్‌పర్సన్‌కు అనుకూలంగా ఉండటమే ఇందుకు కారణమని చెబుతున్నాయి. దీంతో కోవ లక్ష్మికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని, ఎంపీగా ఆత్రం సక్కుకు అవకాశం ఇవ్వాలని అధిష్టానం నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. శనివారం హైదరాబాద్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పార్టీ కోసం కలిసి పనిచేస్తామని ప్రకటించనున్నట్లు సమాచారం.

'సర్వేలన్నీ నాకే అనుకూలం'

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే టికెట్ బీఆర్‌ఎస్ నుంచి సిట్టింగ్‌కు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మిని సీఎం కేసీఆర్ హైదరాబాద్‌కు పిలిపించుకున్న సంగతి తెలిసిందే. ఆగస్టు 15న రాత్రి హైదరాబాద్ చేరుకున్న కోవ లక్ష్మి గురువారం సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ రావును కలిసింది. గతంలో ఇచ్చిన హామీ మేరకు రానున్న శాసనసభ ఎన్నికల్లో మళ్లీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు టికెట్ ఇవ్వాలనే ప్రతిపాదనను ఆమె ముందు మంత్రి హరీశ్ రావు ఉంచగా.. అందుకు కోవ లక్ష్మి అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. పార్టీ కార్యకర్తల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేపై తీవ్ర వ్యతిరేకత ఉందని, ఆ ప్రభావం ఎన్నికల్లో చూపే అవకాశం లేకపోలేదని ఆమె స్పష్టం చేసినట్లు సమాచారం. సిట్టింగ్ ఎమ్మెల్యేకు టికెట్ ఇస్తే పార్టీ ఓటమి పాలవుతుందని, మూడో వ్యక్తి లాభపడతాడని, ఇది పార్టీకి నష్టం చేకూరుస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అధిష్టానానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. 'పైగా సర్వేలన్నీ ఆయనకు వ్యతిరేకంగా ఉన్నాయని, అయినా ఆయనకు పార్టీ టికెట్ ఇచ్చినా.. నేను సపోర్టు చేసినా ఆయన గెలవడని స్పష్టం చేసినట్లు సమాచారం. సర్వేలన్నీ నాకు అనుకూలంగా ఉన్నాయని, గెలుపు గుర్రాన్ని నేనే కాబట్టి.. అవకాశం ఇస్తే పోటీ చేస్తా' అని కోరినట్లు తెలుస్తోంది.

తప్పని తెప్ప ప్రయాణం



కాగజ్‌నగర్ మండలం అందవెల్లి వద్ద పెద్దవాగుపై వంతెన కూలి రాకపోకలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. తాత్కాలిక వంతెన సైతం కొట్టుకుపోవడంతో కాగజ్‌నగర్ పట్టణానికి వెళ్లే వారు ప్రమాదకరంగా తెప్పలపై వాగు దాటుతున్నారు. జిల్లాకు భారీ వర్షసూచన ఉన్న నేపథ్యంలో వాగులో ఆకస్మికంగా వరద పెరిగే అవకాశం ఉంది. ప్రమాదాలు జరగక ముందే అధికారులు అప్రమత్తం కావాలని స్థానికులు కోరుతున్నారు.

- దహెగాం

'బీసీ సాయం' నిరంతర ప్రక్రియ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప
- 300 మందికి చెక్కులు పంపిణీ

కాగజ్‌నగర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన కుల వృత్తిదారులకు అందజేస్తున్న ఆర్థికసాయం నిరంతర ప్రక్రియ అని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప స్పష్టం చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఆరె సంక్షేమ సంఘం భవనంలో సిర్పూర్ నియోజకవర్గానికి చెందిన 300 మంది లబ్ధిదారులకు శుక్రవారం బీసీ సాయం చెక్కులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగిందన్నారు. రాష్ట్రంలోని అన్ని కులసంఘాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ప్రతిపక్షాల మాటలు విని మోసపోవద్దని, ప్రతినెలా ఆర్థికసాయం చెక్కులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు కొండ్ర జగ్గాగౌడ్, మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామయ్య, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సర్దార్ పాపన్నగౌడ్ చిరస్మరణీయుడు



పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: జమీందార్లు, జాగీర్దార్లకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేసి ప్రజల గుండెల్లో సర్దార్ పాపన్నగౌడ్ చిరస్మరణీయుడిగా నిలిచారని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని అధికారికంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ దాసరి వేణు, జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావుతో కలిసి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన సర్వాయి పాపన్నగౌడ్ ఆశయాలను కొనసాగించాలన్నారు. బీసీ సంక్షేమ శాఖ అధికారి సత్యనారాయణరెడ్డి, గౌడ సంఘం నాయకులు బాలేశ్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, జగ్గాగౌడ్, మనోహర్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

కౌటాల(సిర్పూర్): గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలని నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ బృందం అధికారులు డా.సంధ్యా సింగ్, ఈశ్వరీ అన్నారు. కౌటాల మండలం గుండాయిపేటలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. రిజిస్టర్లు, మందుల గది, యోగా గదితోపాటు స్థానిక పరిసరాలను పరిశీలించారు. వైద్యసిబ్బంది అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. కేంద్ర వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న మిషన్ ఇంద్ర ధనుష్, టీకాలు, టీబీ కంట్రోల్, నట్టల నివారణ కార్యక్రమాలతోపాటు సాధారణ కాన్పులు, మతాశిశు మరణాల నియంత్రణపై వివరాలు నమోదు చేసుకున్నారు. వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కేంద్రంలో వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని వారు తెలిపారు. అంతకుముందు టోంకిని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం నాయక్, జిల్లా టీబీ కంట్రోల్ అధికారి సునీల్‌రావు, డాక్టర్ నవత, సర్పంచ్ జాడి సునీత, హెల్త్ సూపర్‌వైజర్లు పవని, ప్రవళిక పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలి

- ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబు



పోస్టర్ విడుదల చేస్తున్న ఇన్‌చార్జి డీఈవో

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో విద్యావ్యవస్థ బలోపేతానికి హెచ్‌ఎంలు కృషి చేయాలని ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్లకు జిల్లాస్థాయి శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ్‌బాబు మాట్లాడుతూ రిసోర్స్‌పర్సన్లు శిక్షణను వినియోగించుకోవాలని సూచించారు. కాంప్లెక్స్‌ల పరిధిలోని అన్ని పాఠశాలల్లో రీడింగ్ క్యాంపెయిన్ పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో పఠనాభివృద్ధి పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం వచ్చేలా చూడాలన్నారు. అలాగే సీఆర్పీలు గ్రంథాలయాల పుస్తకాలు సక్రమంగా వినియోగించుకునేలా దిశానిర్దేశం చేయాలని ఆదేశించారు. అనంతరం రీడింగ్ క్యాంపెయిన్ పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, ఎస్‌వోలు సుభాష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు పకడ్బందీగా అమలు చేయాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఆసిఫాబాద్: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం రాష్ట్రంలోని కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ అన్ని శాఖల కార్యాలయాలను కేంద్రీకృతం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల్లో సమీకృత కలెక్టరేట్ భవనాలను నిర్మించిందన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు ఒకేచోట అందుబాటులోకి తెచ్చిందని పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీసీలో పాల్గొన్న కలెక్టర్ హేమంత్ బోర్కడే మాట్లాడారు. ఆసరా పింఛన్ల మంజూరు, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమం లక్ష్యసాధనకు అధికారుల సమన్వయంతో ముందుకెళ్తున్నామన్నారు. దశాబ్ది వనాల ఏర్పాటుకు అవసరమైన ప్రదేశాలను గుర్తిస్తున్నామని తెలిపారు. రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా మంజూరైన యూనిట్లు, బీసీ కులవృత్తిదారులకు చెక్కుల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో సంక్షేమ పథకాల అమలు సజావుగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆర్డీవోలు సురేశ్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న స్ఫూర్తితో బహుజన రాజ్యం సాధిస్తాం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



నివాళులర్పిస్తున్న ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో తెలంగాణలో బహుజన రాజ్యాధికారం సాధిస్తామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కాగజ్‌నగర్‌లో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకల్లో భాగంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ బీఎస్పీ అన్నివర్గాలను కలుపుకుని ముందుకెళ్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలకు 70 శాతం అసెంబ్లీ స్థానాలను కేటాస్తామని ప్రకటించారు. దమ్ముంటే రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీ లు బీసీలకు 70 శాతం అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

హౌరా లింక్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించాలి

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్‌టౌన్: ప్రజల సౌకర్యార్థం హౌరా లింక్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించి, జిల్లాలో ఆ ట్రెన్‌కు హాల్టింగ్ ఇవ్వాలని కోరుతూ డీఆర్‌యూసీసీ రైల్వే బోర్డు మెంబర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం శుక్రవారం డివిజనల్ రైల్వే మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన డీఆర్‌యూసీసీ సమావేశంలో హౌరా లింక్ ఎక్స్‌ప్రెస్ రైలును కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ రోడ్ స్టేషన్లలో ఆపాలని కోరినట్లు ఆయన తెలిపారు.

'కిక్కు' లక్కెవరిదో..?

- ముగిసిన మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాలో 967కు చేరిన దరఖాస్తులు
- చివరిరోజు కావడంతో పోటీపడిన వ్యాపారులు
- 21న కలెక్టర్ చేతుల మీదుగా లక్కీడ్రా



జిల్లా కేంద్రంలో బారులు తీరిన దరఖాస్తుదారులు

ఆసిఫాబాద్: మద్యం టెండర్ల స్వీకరణ ప్రక్రియ శుక్రవారం ముగిసింది. ఈ నెల 4న దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా.. మొదట్లో మందకొడిగా సాగినా చివరి మూడు రోజుల్లో ఊపందుకున్నాయి. జిల్లాలో 32 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఆసిఫాబాద్ డివిజన్‌లో 459, కాగజ్‌నగర్ డివిజన్‌లో 508 దరఖాస్తులు చొప్పున మొత్తం 967 దరఖాస్తులు వచ్చాయి. దహెగాంలో అత్యధికంగా 86, లింగాపూర్, లోనవెల్లిలో ఒక్కో దరఖాస్తు మాత్రమే వచ్చాయి. శుక్రవారం ఒకేరోజు ఆసిఫాబాద్ డివిజన్‌లో 171, కాగజ్‌నగర్ డివిజన్‌లో 230 చొప్పున మొత్తం 401 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి, ఆదిలాబాద్ డిప్యూటీ కమిషనర్ నర్సింహారెడ్డి తెలిపారు. చివరిరోజు కావడంతో రాత్రి వరకు టెండర్లు స్వీకరించారు. ప్రభుత్వానికి రూ.19.32 కోట్ల ఆదాయం సమకూరింది. జిల్లాలోని మద్యం దుకాణాలకు 2019లో 763, 2021లో 643 దరఖాస్తులు రాగా, ఈసారి అత్యధికంగా 967 దరఖాస్తులు వచ్చాయి. ఈ లెక్కన సగటున ఒక్కో షాపునకు 31.16 దరఖాస్తులు సమర్పించారు. జిల్లాకు చెందిన వారితోపాటు ఇతర జిల్లాలకు చెందిన మద్యం వ్యాపారులు దరఖాస్తు చేసుకునేందుకు ఆసక్తి చూపారు. షాపులు దక్కించుకునేందుకు మహిళలు సైతం పోటీ పడ్డారు. నాలుగేళ్ల క్రితం మహారాష్ట్ర సరిహద్దు మండలాల దుకాణాలకు పోటాపోటీగా దరఖాస్తులు చేసుకున్న వ్యాపారులు.. చంద్రపూర్ జిల్లాలో రెండేళ్ల క్రితం మద్యపాన నిషేధం ఎత్తేయడంతో ఈసారి సరిహద్దు దుకాణాలకు అంతగా ఆసక్తి చూపలేదు.

గ్రూపులుగా ఏర్పడి..

మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు బడా వ్యాపారులతోపాటు సామాన్యులు సైతం గ్రూపులుగా ఏర్పడి దరఖాస్తులు సమర్పించారు. 10 నుంచి 20 మంది కలిసి ఒక గ్రూపుగా ఏర్పడ్డారు. లక్కీడ్రాలో అదృష్టం వరిస్తే మద్యం దుకాణం దక్కుతుందన్న భావనలో ఉన్నారు. 2021లో జిల్లావ్యాప్తంగా 643 దరఖాస్తులు రాగా, ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల చొప్పున ప్రభుత్వానికి రూ.12.86 కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది పోటీ పెరగడంతో మరింత ఆదాయం సమకూరింది.

లక్కీడ్రాకు అధికారుల ఏర్పాట్లు..

మద్యం దుకాణాల లక్కీడ్రా ఈ నెల 21న జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ చేతుల మీదుగా లక్కీడ్రాను ప్రారంభించనున్నారు. దరఖాస్తుదారులు ఉదయం 9 గంటలకు కుమురంభీం భవన్‌కు చేరుకోవాలి. దరఖాస్తుతోపాటు ఎక్సైజ్ శాఖ ఇచ్చిన రశీదును తీసుకురావాలి. దరఖాస్తుదారుడు రాలేని పరిస్థితుల్లో ఆథరైజేషన్ లేటర్ ఉన్న వ్యక్తులను అనుమతిస్తారు. ఇందుకు సంబంధించిన ఎంట్రీ పాసులను దరఖాస్తుదారులకు అందజేస్తారు. లక్కీడ్రా నేపథ్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో తాగునీరు, జనరేటర్, మైక్ సెట్‌తోపాటు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్సైజ్‌శాఖ విడుదల చేసిన గెజిట్ ప్రకారం సీరియల్ నంబర్ 1 నుంచి లక్కీడ్రా తీయనున్నారు. మధ్యాహ్నం వరకు లక్కీడ్రా ద్వారా అన్ని దుకాణాల కేటాయింపులు పూర్తికానున్నాయి. అదృష్టం వరించిన వారు డిసెంబర్ నుంచి షాపులు నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కోటపల్లి(చెన్నూర్): విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఎద్దు మృతి చెందడమే కాకుండా యజమానికి తృటిలో ప్రాణాపాయం తప్పిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పుల్లగామకు చెందిన కావిరి చిన్నసమ్మయ్య శుక్రవారం తన ఎద్దును తీసుకుని పంటచేలకు వెళ్తుండగా రోడ్డుపై పడిఉన్న విద్యుత్ తీగలను తాకడంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. సమ్మయ్య తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. విషయాన్ని సర్పంచ్ సుమలత ద్వారా అధికారులకు సమాచారం అందించినా స్పందించలేదన్నారు. విద్యుత్ తీగలు తెగి పడి ఉన్నట్లు ముందురోజే సమాచారం అందించినా లైన్‌మేన్ పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. లైన్‌మేన్, హెల్పర్ నిర్లక్ష్యంతోనే రూ.50 వేల ఎద్దు మృతి చెందిందని, గతంలో కూడా పలు ప్రమాదాలు జరిగినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. లైన్‌మేన్, హెల్పర్‌పై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని సమ్మయ్య కోరుతున్నాడు.

'అగాఖాన్' టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక

బెల్లంపల్లి: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సీవోఈ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు అగాఖాన్ అకాడమీ నిర్వహించిన రీజియన్ స్థాయి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చి రెండో దశకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆదిలాబాద్ రీజియన్ నుండి 46 మంది విద్యార్థులు ఎంపికైనట్లు వివరించారు. ఈ నెల 28న రెండో దశ టాలెంట్ టెస్టు నిర్వహించనున్నట్లు తెలిపారు. జేవీపీ కొక్కుల రాజేశ్వర్, ఉపాధ్యాయులు ప్రవంతి, శాతరాజు తిరుపతి, అజిత, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు

కాగజ్‌నగర్‌టౌన్: మూడో రైల్వేలైన్ పనుల నిమిత్తం పలు రైళ్లను రద్దు చేస్తూ దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు కాగజ్‌నగర్ రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కై లాష్ శ్యాంకుమార్ తెలిపారు. ఈ నెల 21 నుండి 28 వరకు కాజీపేట-సిర్పూర్ టౌన్ (రామగిరి), బల్లార్షా నుండి కాజీపేట (సింగరేణి), భద్రాచలం రోడ్డు నుండి బల్లార్షా (సింగరేణి), సిర్పూర్ టౌన్ నుండి భద్రాచలం రోడ్డు (రామగిరి), సిర్పూర్ టౌన్ నుండి కరీంనగర్ (పుష్‌పుల్), కరీంనగర్ నుండి సిర్పూర్ టౌన్ (పుష్‌పుల్), కాజీపేట నుండి బల్లార్షా (ప్యాసింజర్), బల్లార్షా నుండి కాజీపేట (ప్యాసింజర్) రైళ్లను రద్దు చేసినట్లు ఆయన వెల్లడించారు. ప్రయాణికులు గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య

కాగజ్‌నగర్‌టౌన్: ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. సీఐ బుద్దేస్వామి తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని సంజీవయ్య కాలనీలో నివాసం ఉంటున్న నాగయ్య (67) కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. అతని భార్య గతంలోనే చనిపోగా ప్రస్తుతం ఒంటరిగానే ఉంటున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

ఫ్లెక్సీ గొడవలో ఇరు వర్గాలపై కేసు

బెల్లంపల్లి: పట్టణంలోని కన్నాల ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద బీఎస్పీ, బీఆర్ఎస్ యూత్ విభాగం శ్రేణుల మధ్య జరిగిన ఫ్లెక్సీ గొడవలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ ఎస్‌హెచ్‌ఓ టి.శంకరయ్య తెలిపారు. బీఎస్పీ నాయకుడు వరప్రసాద్ ఈనెల 2న విజయ్ ఆర్ట్స్ నిర్వాహకులకు రూ.3వేలు అడ్డెచెల్లించి బోర్డింగ్‌కు ఫ్లెక్సీ ఏర్పాటు చేసుకున్నాడు. బీఆర్ఎస్ యూత్ విభాగం పట్టణ అధ్యక్షుడు సన్నీబాబు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని విజయ్ ఆర్ట్స్ నిర్వాహకులతో మాట్లాడి వరప్రసాద్ కట్టిన ఫ్లెక్సీపై కట్టడంతో వివాదం తలెత్తింది. ఇరువర్గాలకు కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. కానీ కొంతమంది పోలీసులపై బురదజల్లే విధంగా సామాజిక మాధ్యమాల్లో మెసేజ్ చేస్తున్నారని, అలాంటి యత్నాలు విరమించుకోవాలని సూచించారు.

దృశ్యం.. సజీవం



పాత మంచిర్యాల: జక్కుల రాజు తీసిన గాంధారి మైసమ్మ జాతర ఫొటో



జన్నారం: ఎల్లం తీసిన చింతలమాదర జలపాతం ఫొటో

- మధుర స్మృతులు... కలకాలం పదిలం...
- ఫొటోలు శాశ్వతం...
- గతం తీపి గుర్తుల జ్ఞాపకం
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రెప్పపాటు కాలంలో దృశ్యాన్ని బంధించి శాశ్వత కాలానికి సజీవ సాక్ష్యంగా నిలిపేదే ఛాయాచిత్రం. గత స్మృతులను సైతం పది కాలాలపాటు పదిలంగా మన ముందు మెదిలేలా నిత్యం ప్రత్యక్షంగా కనిపించేవే ఫొటోలు. ప్రకృతి అందాలు, పారే సెలయేర్లు, పచ్చిక బయళ్లు, వినీలాకాశ వింతలు, సప్తవర్ణ శోభితాలు కనులముందు నిలిపేవి ఛాయాచిత్రాలు. 1839 ఆగస్టు 19న ఫ్రాన్స్‌కు చెందిన ఎల్.జె.ఎం.డ్యాగురే తొలిసారిగా సెన్సర్ అయోడైజ్డ్ ద్వారా తీసిన చిత్రాలను ఫ్రాన్స్ సైన్స్ అకాడమీకి అప్పగించారు. అప్పుడే ఆయన ఫొటోలను ఫ్రాన్స్ గుర్తించి ఆగస్టు 19నే ప్రపంచ ఫొటోగ్రఫీ దినంగా ప్రకటించారు. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కథనం.

అందమైన అడవులు.. అద్భుత చిత్రాలు

జన్నారం(ఖానాపూర్): పచ్చని అడవుల అందాలకు కేరాఫ్ కవ్వాల్ పులుల రక్షిత ప్రదేశం కవ్వాల్ అభయారణ్యం. పక్షుల కిలకిల రావాలు, వన్యప్రాణుల పరుగులు, వన్యమృగాల గాండ్రింపులు, అడవి అందాలను బయటకు తీయడానికి డివిజనల్ ఫారెస్ట్ అధికారి సిరిపురం మాధవరావు కెమెరా చేతబట్టారు. వృత్తి పరంగా అటవీశాఖ అధికారి అయినా ఫొటోలు తీయడం ఆయన హాబీ. అడవిలోకి బైనాకిల్ కెమెరాను భుజాన వేసుకుని వెళ్తారు. రెండేళ్ల క్రితం తాను తీసిన గద్ద ఫొటో జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతికి ఎంపికైంది. జన్నారం అటవీ డివిజన్‌లోని టైగర్ కన్జర్వేషన్ ఆఫ్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఫొటోగ్రాఫర్ ఎల్లం కూడా తనదైన శైలిలో ఫొటోలు తీసి అబ్బుర పరుస్తున్నారు. దట్టమైన అడవుల్లోని జలపాతాలు, పచ్చని చెట్లతో ఒదిగిన గుహలు, అందమైన చెట్లు, పక్షుల ఫొటోలు తీసి తనదైన శైలిలో ప్రపంచానికి చూపుతున్నారు.



జన్నారం: కవ్వాల్ అభయారణ్యం



జన్నారం: రొమాంటిక్ చిలుకలు



మంచిర్యాలరూరల్(హాజీపూర్): ర్యాలీ జలపాతం

ఫొటోగ్రఫీలో రాణిస్తున్న రాజు



రాజును సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్, ఎమ్మెల్యే దివాకర్‌రావు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రానికి చెందిన జక్కుల రాజు 1997 నుంచి ఫొటోగ్రఫీలో రాణిస్తున్నారు. సొంతంగా ఫొటో, వీడియోగ్రఫీ చేస్తూ పదిమందికి ఈ వృత్తిలో శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై డాక్యుమెంటరీలు నిర్మిస్తు అధికారుల ప్రశంసలు అందుకుంటున్నారు. 2022లో జిల్లా కేంద్రంలోని బొక్కల గుట్ట గాంధారి మైసమ్మ జాతర డాక్యుమెంటరీ నిర్మించినందుకు అప్పటి ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి ప్రశంసాపత్రంతో సన్మానించారు. ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నిర్వహించిన తెలంగాణ బోనాల పండగ ఫొటోగ్రఫీ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి అందుకున్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా 2019లో మంచిర్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో పాల్గొని ప్రథమ బహుమతి సాధించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణ ప్రగతి ఫొటోలకు జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, ఎమ్మెల్యే దివాకర్‌రావు చేతుల మీదుగా ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు అందుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

- కంటెయినర్‌ను ఢీకొన్న లారీ
- డ్రైవర్, క్లీనర్ మృతి




డ్రైవర్ హనుమంతు, క్లీనర్ సురేష్ మృతదేహాలు

మందమర్రిరూరల్: మందమర్రి పోలీసుస్టేషన్ పరిధిలోని అందుగులపేట వద్ద కోరెగట్టు ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. ఆగి ఉన్న ఎక్స్‌ప్లోజివ్ కంటెయినర్‌ను లారీ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఎస్సై చంద్రకుమార్, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగపూర్ నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న ఎక్స్‌ప్లోజివ్ కంటెయినర్‌లో సాంకేతిక లోపం ఏర్పడడంతో డ్రైవర్ రోడ్డుపై నిలిపి మెకానిక్ కోసం మందమర్రి పట్టణానికి వెళ్లాడు. ఛత్తీసగఢ్ నుంచి బెంగళూర్ వైపు జే వైర్ లోడ్‌తో వెళ్తున్న లారీ అతివేగంగా రోడ్డుపై ఆగి ఉన్న కంటెయినర్‌ను ఢీకొట్టింది. దీంతో అనంతపురం జిల్లా హిందూపురం మండలం లేపాక్షికి చెందిన లారీ డ్రైవర్ హనుమంతు(28), క్లీనర్ సురేష్(45) తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై చంద్రకుమార్ క్షతగాత్రులను లారీ నుంచి బయటకు తీసి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా సురేష్ మార్గమధ్యంలో, ఆస్పత్రిలో డ్రైవర్ చనిపోయారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

విద్యార్థినికి ఆశ్రయం కల్పించిన 'సఖి'



విద్యార్థినితో సఖి సెంటర్ నిర్వాహకులు

మంచిర్యాలక్రైం: డిగ్రీ పరీక్షలు రాసేందుకు జగిత్యాల నుంచి లక్సెట్టిపేటకు వచ్చి ఇబ్బందులు ఎదుర్కొన్న విద్యార్థినికి మంచిర్యాల సఖి సెంటర్ నిర్వాహకులు రెండు రోజుల పాటు రక్షణ కల్పించి పరీక్షలు రాయించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సఖి సెంటర్ నిర్వాహకురాలు శ్రీలత తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాలకు చెందిన ఓ విద్యార్థిని ఈ నెల 16న లక్సెట్టిపేట డిగ్రీ కళాశాలలో పరీక్ష రాయాల్సి ఉంది. 16న వస్తే పరీక్ష సమయానికి హాజరు కాలేనని 15న రాత్రి ఇంట్లో నుంచి బయలుదేరింది. లక్సెట్టిపేటలో వసతి దొరకకపోవడంతో డిగ్రీ కళాశాల ఎదుట ఒంటరిగా నిస్సహాయ స్థితితో కూర్చుంది. పెట్రోలింగ్ చేస్తున్న బ్లూకోర్ట్ పోలీసులు సదరు విద్యార్థిని వివరాలు తెలుసుకుని సఖి సెంటర్‌కు సమాచారం అందించారు. స్పదించిన సిబ్బంది సదరు విద్యార్థినిని సఖి సెంటర్‌కు తీసుకువచ్చి వెల్‌కమ్ కిట్ అందజేశారు. పరీక్షల అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించి అప్పగించారు. విద్యార్థినికి రక్షణ కల్పించిన సఖి సెంటర్ నిర్వాహకులను పలువురు అభినందించారు.

ఐటీఐలో ప్రవేశానికి గడువు పొడిగింపు

మంచిర్యాలఅర్బన్: ఐటీఐలో ప్రవేశానికి గడువు పొడిగించినట్లు మంచిర్యాల ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ చందర్ తెలిపారు. ఈ నెల 19 నుంచి 30 వరకు మూడో దఫా ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పదోతరగతి మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక జరుగుతుందన్నారు. జిల్లాలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, వెల్డర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మోటర్ మెకానిక్, డీజిల్ మెకానిక్, డ్రాఫ్ట్ మాన్ సివిల్, కోప(కంప్యూటర్ కోర్సు) డ్రెస్ మేకింగ్, ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు htpp://iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

కడుపునొప్పి భరించలేక వృద్ధుడు బలవన్మరణం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): కడుపునొప్పి భరించలేక వృద్ధుడు బలవన్మరణం చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం హాజీపూర్ మండలంలోని దొనబండకు చెందిన పెరంబుదునూరి జగ్గయ్య(76)వృద్ధాప్యంతో పాటు ఆరోగ్య సమస్యలతో బాధపుతూ ఇంటివద్ద ఒంటరిగా ఉంటున్నాడు. శుక్రవారం సిద్దిపేటలో ఉంటున్న తన కుమారుడు రామానుజంకు ఫోన్‌చేసి కడుపునొప్పి తీవ్రంగా ఉందని చెప్పడంతో పెన్షన్ తీసుకుని సిద్దిపేటకు వచ్చాక ఆస్పత్రిలో చూపిస్తానన్నాడు. కొంత సేపటికే ఇంటి ముందున్న సజ్జ పైభాగంలోని ఇనుప కొక్కానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు కుమారుడికి సమాచారం అందించారు. రామానుజం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సింగరేణి కార్మికుడు ఆత్మహత్య



అశోక్ (ఫైల్)

నస్పూర్: ఉరేసుకుని సింగరేణి కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘట న పట్టణ పరిధి లోని శ్రీరాంపూ ర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శ్రీరాంపూర్ ఎస్సై రాజేశ్ తెలిపిన వివరాల ప్రకారం పట్టన పరిధిలోని శ్రీరాంపూర్ లక్ష్మీనగర్‌కు చెందిన ఏనుగుల అశోక్ (34) శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే 7 గనిలో ట్రామర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. అతని మానసిక పరిస్థతి సరిగా లేకపోవడంతో గురువారం రాత్రి తన ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహ త్య చేసుకున్నాడు. మృతునికి భా ర్య రమ, కూతురు ఉన్నారు. కు టుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి స్వాధీనం



హద్దులు వేయిస్తున్న అధికారులు

నస్పూర్: పట్టణ పరిధిలో ఆయుర్వేదిక్ ఆస్పత్రి భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని కొందరు కబ్జా చేయగా శుక్రవారం ఆయుర్వేదిక్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆయుష్ వరంగల్ రీజనల్ డిప్యూటి డైరెక్టర్ డాక్టర్ రవినాయక్ మాట్లాడుతూ పట్టణంలోని ఆయుర్వేదిక్ ఆసుపత్రి భవన నిర్మాణానికి ప్రభుత్వం 2016లో నస్పూర్ శివారు సర్వే నంబరు 64లో నాలుగు గుంటల స్థలాన్ని కేటాయించిందన్నారు. నిధుల లేమితో భవన నిర్మాణం చేపట్టలేకపోయామన్నారు. ఇటీవల కొందరు ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రహరీ నిర్మించడంతో విషయాన్ని తమ సిబ్బంది అదనపు కలెక్టర్ మోతీలాల్, ఎమ్మెల్యే దివాకర్‌రావు, పోలీసులు, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారన్నారు. వారు స్పందించి రెవెన్యూ అధికారుల సహాయంతో తమస్థలాన్ని అప్పగించగా చుట్టూ హద్దులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పద్మజ, డాక్టర్ నారాయణ, డాక్టర్ నీరజ, రెవెన్యూ ఆర్ఐ మాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి జీఎంగా మనోహర్



మనోహర్, జీఎం

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి ఏరియా జీఎం గుండ మోహన్‌రెడ్డిని కార్పొరేట్ (సీఎంసీ)కు, ఆయన స్థానంలో ఆర్జీ–2 జీఎం మనోహర్‌ను ఇక్కడికి బదిలీ చేస్తూ సింగరేణి యాజమాన్యం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు నెలల క్రితం బదిలీపై వచ్చిన మోహన్‌రెడ్డి ఏరియాలో సింగరేణి క్వార్టర్ల కబ్జాపై కొరడా ఝుళిపించారు. ఒక యూనియన్ నాయకుడు ఐదేళ్లుగా క్వార్టర్‌కు అద్దె చెల్లించకపోవడమే కాకుండా క్వార్టర్ కూల్చివేసి అక్రమ నిర్మాణం చేపట్టిన ఘటనలో ఇద్దరు సెక్యూరిటీ గార్డులను సస్పెండ్ చేయడం, పైరవీలకు తావివ్వకపోవడం, తదితర అంశాలపై జీఎం నిక్కచ్చిగా వ్యవహరించారు. అందుకే కేవలం నాలుగున్నర నెలల్లోనే బదిలీ చేస్తున్నారని ఏరియాలో పలువురు అనుకుంటున్నారు.

పాదయాత్రను అడ్డుకున్న పోలీసులు

నెన్నెల(బెల్లంపల్లి): మండలంలోని కోణంపేట, పాటి, బోగంపల్లి, వేమనపల్లి మండలంలోని నాగారాం, శ్రావణ్‌పల్లి, బొమ్మెన, కన్నెపల్లి మండలంలోని బుయ్యారం గ్రామాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కోణంపేట నుంచి ప్రారంభమైన చలో కలెక్టరేట్ పాక్షిక పాదయాత్రను శుక్రవారం కన్నెగూడెం క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు అడ్డుకుని ఆందోళనకారులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పాదయాత్రకు పోలీసుల అనుమతి తీసుకోలేదని, శాంతి భద్రతలకు భంగం కలగకుండా ముందస్తుగా అరెస్టు చేశామని ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. కార్యక్రమంలో కొండగొర్ల చంద్రయ్య, సునార్కరి శంకర్, జుమ్మిడి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జైపూర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏసీపీ

జైపూర్(చెన్నూర్): జైపూర్ పోలీస్‌స్టేషన్‌ను ఏసీపీ మోహన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ రమేశ్‌బాబు, ఎస్సై ఉపేందర్‌రావు, అదనపు ఎస్సై నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా పోచం

చెన్నూర్: నేతకాని హక్కుల పోరా ట (చైతన్య) సమితి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా చెన్నూర్‌కు చెందిన రాంటెంకి పోచం నియామకమైనట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్కే నేతకాని తెలిపారు. శుక్రవా రం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోచం మా ట్లాడుతూ జిల్లాలోని నేతకాని సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

బెల్లంపల్లి: పట్టణంలోని సాంఘిక సంక్షేమ కాసిపేట బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో శనివారం జిల్లాస్థాయి అథ్లెటిక్స్, మిడిల్, లాంగ్ డిస్టెన్స్, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి 250 మంది విద్యార్థులు హాజరు కాగా ప్రతిభ కనబర్చిన పది మంది విద్యార్థులను ఈనెల 20న బాయ్స్ స్పోర్ట్స్ ఆర్మీ కంపెనీ నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో వివేక్ వర్ధన్, సాయి కిరణ్, రవితేజ, సాత్విక్, సంతోష్, ప్రేమ్‌కుమార్, అంజన్న, రాహుల్, సాయికృష్ణ, వైష్ణవి ఉన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్, జిల్లా అథ్లెటిక్స్ కార్యదర్శి మారయ్య, తదితరులు పాల్గొన్నారు.

అడవికుక్కల దాడిలో 11 మేకలు మృతి

కోటపల్లి: మండలంలోని అన్నారంలో మేకల మందపై అడవి కుక్కలు దాడి చేసిన ఘటనలో 11 మేకలు మృతి చెందినట్లు సమ్మయ్య, కిష్ట య్య తెలిపారు. శుక్రవారం అన్నా రం గ్రామ శివారులోని అటవీప్రాంతంలో వర్షం రావడంతో మేకల మంద రెండుగా విడిపోయింది. ఒక గ్రూపు మేకల మందపై 9 అడ వి కుక్కలు దాడిచేసి 11 మేకలను హతమార్చాయి. ఇంకా ఆరు మేక ల ఆచూకీ లభించలేదని బాధితులు వాపోయారు. ఫారెస్టు అధికారులకు సమాచారం అందించినట్లు వారు పేర్కొన్నారు.

పురుగులమందు తాగి రైతు ఆత్మహత్య

ఉట్నూర్‌రూరల్: పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై ప్రదీప్‌కుమార్ వివరాల ప్రకారం... ఉట్నూర్ మండలం పాటగూడకు చెందిన కుర్సెంగ లక్ష్మీదేవురావుకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు కుర్సెంగ ప్రకాశ్ (35) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం మద్యం మత్తులో పంట చేనుకు వెళ్లి పురుగుల మందు తాగాడు. ఇంటికి చేరుకుని విషయం చెప్పడంతో కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించి గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు సంతానం ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లిఫ్ట్ ఇచ్చి.. కత్తితో బెదిరించి

- ఇద్దరిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న పట్టణ సీఐ శ్రీను

భైంసా: ఓ వ్యక్తిని కత్తితో బెదిరించి అతడి వద్ద ఉన్న నగదుతో పాటు సెల్‌ఫోన్‌ను దొంగలించిన ఇద్దరు నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ శ్రీను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 14న గుంటూరు జిల్లా పడిగురాళ్లకు చెందిన పూర్ణయ్య వ్యాపారం నిమిత్తం భైంసాకు వచ్చాడు. రాత్రి భోజనం చేసి 9.15గంటలకు ఆటో కోసం వేచిచూస్తున్నాడు. ఆ సమయంలో భైంసా పట్టణంలోని ఓవైసీనగర్‌కు చెందిన సల్మాన్ ఖాన్, సయ్యద్ అవేస అనే ఇద్దరు యువకులు బైక్‌పై అతడిని ఎక్కించుకుని శివారు ప్రాంతానికి తీసుకువెళ్లారు. గడ్డెన్నవాగు ప్రాజెక్టు సమీపంలో బైక్ ఆపి కత్తితో బెదిరించి అతడి వద్ద ఉన్న నగదుతో పాటు సెల్‌ఫోన్ లాక్కుని కొట్టి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఎస్సై పూర్ణేశ్వర్ శుక్రవారం నాందేడ్ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తుండగా ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి మొబైల్‌తో పాటు స్పెండర్ ప్లస్ బైక్‌ను సీజ్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.